క్లుప్తంగా

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణమ్మ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) జిల్లా ఆరో మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 15వ తేదీన జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు మహాసభలు ప్రారంభం కానున్నాయని, ఇందులో జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. గడిచిన మూడేళ్లలో యూనియన్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు స్వర్ణ, కృష్ణమ్మ, శిరీష, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో వెంకటేశ్వరుడు



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పల్లకిసేవను సాయంత్రం జరిపారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని ఇనమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పొన్నవోలు సుధీర్‌కుమార్‌రెడ్డి ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డితో కలిసి సుధీర్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, నాయకులు ఎరటపల్లి మీరారెడ్డి, నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీ కల్యాణి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సోనగిరి జగన్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, నాయకులు హరి, మొలకమ్మ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కాగా ఇనమడుగుకు ప్రసన్న రాక సందర్భంగా పెద్ద సంఖ్యలో రైతు సంఘ నాయకులు వచ్చి సమావేశమయ్యారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కోవూరులో లోక్ అదాలత్

కోవూరు: కోవూరు కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.చైతన్య మాట్లాడుతూ బ్యాంక్ కేసులు 31, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి బిల్లుల కేసులు 18, సివిల్, క్రిమినల్ కేసులు 90 పరిష్కారమయ్యాయన్నారు. సెటిల్‌మెంట్ అమౌంట్ రూ.10.36 లక్షలు రికవరీ జరిగిందన్నారు. కోర్టుల్లో కేసులు సంవత్సరాల తరబడి వాయిదాలపై నడుస్తుంటాయని, కానీ లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. కేసు పరిష్కారమైతే ఇరువురికీ మేలు జరుగుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న వివాదాలు, కుటుంబ సమస్యలు, బ్యాంక్ రుణాలు వంటి వాటిపై ఇక్కడ రాజీ పడితే ఇరుపక్షాలకు లాభం కలుగుతుందని వివరించారు. నెల్లూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, కోవూరు లోక్ అదాలత్ ఏజేఎంఎఫ్‌సీ కోర్టు ఇన్‌చార్జి జడ్జి పి.భరద్వాజ్, కోవూరు స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కృష్ణయ్య, సభ్యులు వి.రాంబాబు, పి.వీరేంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువలు బురదమయం

- పట్టించుకునే వారు కరువు
- ప్రజలకు తప్పని తిప్పలు



చెరువు వద్ద నెక్లస్ రోడ్డును ఆనుకొని ఉన్న కాలువ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సాగునీటి కాలువలు ఇప్పుడు మురుగుకాలువలుగా మారిపోయాయి. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో పారే కాలువలు ఇప్పుడు కనిపించడం లేదు. ఆ కాలువల్లో పూడికతీత, మొక్కలను తొలగించే పనులు చేపట్టడం లేదు. దీంతో కాలువల పక్కన నివసించే ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది.

దుస్థితిలో రామిరెడ్డి కాలువ

నెల్లూరు చెరువుకు కలుజు నుంచి నీరు పారేందుకు కాలువ ఉండేది. కలుజును ఆనుకుని ధోబీఘాట్ ఉంది. నెక్లస్ రోడ్డు నిర్మాణంతో కలుజును మూసివేశారు. దానిపై రోడ్డు వేశారు. ఇవతల ఉండే కాలువలో నీరు పారే పరిస్థితి లేనప్పటికీ మురుగునీరు అలాగే ఉండిపోయి దుర్గంధం విపరీతమైపోయింది. ఆ ప్రాంతంలో ఉన్న ధోబీఘాట్‌ను పక్కకు మార్చి మున్సిపాలిటీ నీటితో ధోబీఘాట్‌ను నిర్వహిస్తున్నారు. చెరువును ఆనుకుని ఈ రామిరెడ్డి కాలువ హబిబుల్లాపేట, రామిరెడ్డిపేటల మీదుగా ఉంది. వర్షపు నీటితో పాటు మురుగు కాలువల నీరు వీటిలో చేరిపోతున్నాయి. ఆ కాలువల్లో చెత్తా చెదారాన్ని తీసే పరిస్థితి లేదు. విపరీతమైన మురుగు నీటి వల్ల దోమలు, పాములు, పందులు ఆ కాలువల పరిసర ప్రాంతాల్లో ఉండే నివాసాల ప్రజలకు అనారోగ్యం కలిగేలా చేస్తున్నాయి. ఆ కాలువ పూర్తిగా మురుగునీటితో నిండిపోయి అనేక ఇబ్బందులను కలిగిస్తోంది. ఇప్పటికైనా ఆ కాలువ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గచ్చు కాలువ పరిస్థితి ఇలా..

నెల్లూరు చెరువు దగ్గర నుంచి మనుమసిద్ధినగర్ మీదుగా ఉమామహేశ్వరి దేవాలయం వరకు గచ్చు కాలువ పారుతోంది. మనుమసిద్ధినగర్ చివర నుంచి ఈ కాలువకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఈ పనులను ఆపేశారు. దీంతో రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం తవ్విన మట్టి ఆ కాలువ మధ్యలోనే ఉండిపోవడంతో నీరు పారడం ఇబ్బందికరంగా మారింది. ఎక్కువ నీరు వస్తే సమీపంలో ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితి నెలకొంది. పాత జిల్లా జైలు వద్ద కల్వర్టు మీద కాకుండా అటు ఇటు వేసిన రోడ్డు వల్ల కల్వర్టు కిందకు వెళ్లింది. కల్వర్టుకు, రోడ్డుకు ఒక అడుగు ఎత్తు ఉండడంతో నాలుగు చక్రాల వాహనాలు ఈ కల్వర్టు ఎక్కడం, దిగడం వల్ల దెబ్బతింటున్నాయి. ఉమామహేశ్వరి దేవాలయం నుంచి ఇంకా నగరం గుండా మద్రాసు బస్టాండ్, మినీబైపాస్ రోడ్డులపై సైతం ఈకాలువ పారుతోంది. ఏ ప్రాంతంలో సైతం మురుగు కానీ, గుర్రపు డెక్కను తీయకపోవడంతో కాలువ దుర్గంధంగా మారింది. దీనిపై ఇరిగేషన్ ఏఈ మహేశ్వర్ మాట్లాడుతూ రూ.40 కోట్లతో ఈ కాలువ పనులు త్వరలో చేపట్టనున్నట్లు చెప్పుకొచ్చారు.



హబీబుల్లాపేటలో రామిరెడ్డి (కలుజు) కాలువ దుస్థితి



పాత జిల్లా జైలు వద్ద గచ్చు కాలువలో ఇలా..



మార్కెట్‌కు వెళ్లే దారిలో చెత్తా చెదారంతో నిండిన కాలువ

జీజీహెచ్‌లో హెచ్‌డీఎస్ కమిటీ తనిఖీ



జీజీహెచ్ సెల్లార్ పరిసరాలను తనిఖీ చేస్తున్న హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం హాస్పిటల్‌లోని పలు విభాగాలను తనిఖీ చేశారు. సెల్లార్‌తో పాటు మోటార్లు సక్రమంగా పని చేస్తున్నాయా.. విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురయ్యాయా.. లైట్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎస్ కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో సెల్లార్‌లో నీరు చేరిపోతోందన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ప్యానెల్ బోర్డులు మునిగిపోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని హాస్పిటల్ అధికారులకు సూచించారు. ఒక మోటారు మరమ్మతులకు గురయిందని దానిని వెంటనే సరిచేయించాలని సూచించారు. నీరు పోయే కాలువల పూడికను తొలగించాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆస్పత్రి ఏడీ ఏడుకొండలు సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మోటారును తక్షణమే మరమ్మతులు చేసి వర్కింగ్ కండిషన్‌లోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ సూపర్‌వైజర్ విజయకుమార్, ప్రభుత్వ సూపర్‌వైజర్ పృథ్వీరాజ్, సెక్యూరిటీ సీఎస్ఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనే



మాట్లాడుతున్న ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(అర్బన్): వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు స్పష్టం చేశారు. నెల్లూరు హరనాథపురంలో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కారుణ్య నియామకాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి నియామకాలు జరిపి ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చాలని డిమాండ్ చేశారు. ఆఫీస్ సబార్డినేట్లలో అర్హత ఉన్నవారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గత 27 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలు అదే హోదాలో ఉన్నారన్నారు. వీరితో చేరిన ఇతర కేడర్ ఉద్యోగులు ఒకటికి రెండు ప్రమోషన్లు తీసుకున్నప్పటికీ ఏఎన్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో అదే స్థానంలో పదవీ విరమణ కావడం అన్యాయమన్నారు. ఆరోగ్యశాఖలో ఫార్మసీ అధికారులు, టెక్నీషియన్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం రెండు రోజుల క్రితం ఆ సంఘం సిటీ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో హంస జిల్లా కార్యదర్శి కమలేకిరణ్, గౌరవాధ్యక్షురాలు ఇందిర, గౌరవ సలహాదారు పరిమళ, నాయకులు నారాయణ రాజు, జలీల్ అహ్మద్, శేషగిరిరావు, మజార్, రాజయ్య, నాగరాజు, ప్రసాద్, నాగరాజమ్మ, ఉష, గౌస్‌బాషా, మంజరి, ఇందుకూరుపేట, వాకాడు, వింజమూరు, కోవూరు తదితర మండలాల ప్రెసిడెంట్లు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో యథేచ్ఛగా తరగతులు

- ఆయా కళాశాలలపై చర్యలకు డిమాండ్



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరు (టౌన్): సెలవు రోజుల్లో ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో యథేచ్ఛగా తరగతులు జరుగుతున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం తరగతులు నిర్వహిస్తున్న పలు జూనియర్ కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో శనివారం సెలవు అయినప్పటికీ నారాయణ, శ్రీచైతన్య, ఆర్ఎన్నార్ తదితర కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై ఆర్ఐఓ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరగతులు నిర్వహణపై అడ్డుకోవడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులపై ఆయా యాజమాన్యాలు దౌర్జన్యాలు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విక్రమ్, వంశీ, లోకేష్, విష్ణు, నాగేంద్ర, దివేష్, అమర్, సల్మాన్, బషీర్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం సంస్మరణ సభ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఆదివారం నగరంలో నిర్వహించున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అధికార, ప్రతిపక్ష నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కార్మిక, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు పాల్గొననున్నారన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి



సీతారామ్ ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ఆశయ సాధనకై తమ వంతు కృషి చేస్తామని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేశారు. బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శనివారం నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలు ఆలపించారు. మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి పార్లమెంట్ లోపల, బయట ప్రజా సమస్యలపై చేసిన పోరాటంలో తనదైన పాత్ర పోషించారన్నారు. భారతదేశంలో అనేక ప్రజా సమస్యలపై పోరాటాలను రూపొందించారన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా, నగరంలో ప్రజా సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, మస్తాన్ బీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అర్బన్ కాంక్లేవ్



కేరళ మంత్రి రాజేష్‌తో కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో అక్కడి ప్రభుత్వం నిర్వహిస్తున్న అర్బన్ కాంక్లేవ్ శనివారం ముగిసింది. ఇందులో కమిషనర్ నందన్ పాల్గొని, 'ఆకాంక్షించే నగరాలు, అభివృద్ధి చెందు సమాజాలు' అనే అంశంపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

జీవనోపాధులు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న మెప్మా పీడీ లీలారాణి

నెల్లూరు(బారకాసు): ఆర్పీలు, పొదుపు మహిళలు చేపట్టే జీవనోపాధులు పారదర్శకత ఉండాలని మెప్మా పీడీ లీలారాణి సూచించారు. స్థానిక ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ఆర్పీలకు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని మహిళలు చేపడుతున్న జీవనోపాధులపై ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. మెప్మాలో చేపడుతున్న అనేక కార్యక్రమాలు వాటి అమలుపై చర్చించి ఆర్పీలు చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ప్రతి యాక్టివిటీలో మంచి ఫలితాలు సాధించే విధంగా పని చేయాలన్నారు. సంఘాల ఆడిట్ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. సంఘాల డేటాను పొందుపరచడంలో ఏమైనా మార్పులు ఉంటే వెంటనే చేపట్టాలని తెలియజేశారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు త్వరలో హెల్త్ చెకప్‌లు చేయించి, వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐబీ అంకయ్య, టీఈ సుధాకర్, సీఎంఎం కవిత, జరీనాతో పాటు సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సామూహిక ధర్నా



ఎన్టీఆర్ నగర్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 11వ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సామూహిక నిరసన ధర్నా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ నగర్ నాలుగో బిట్ సెంటర్‌లో ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు చేపట్టిన నిరసన ధర్నాకు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు హాజరై, మాట్లాడారు. ఎన్టీఆర్ నగర్, రాయపుపాళెం, కొండారెడ్డి దిబ్బ, పల్లెపాళెం ప్రాంతాల్లో గత 50 ఏళ్ల నుంచి నివసిస్తున్న పేద ప్రజల ఇళ్లు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ఇళ్లు లేని పేదలకు 12 అంకణాల స్థలాన్ని నేటి కూటమి ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఎన్టీఆర్ నగర్‌లో ప్రభుత్వ హైస్కూల్, రేషన్ దుకాణం, సచివాలయాలను ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లేందుకు అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు దశల వారీగా ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మురళి, ఆదిలక్ష్మి, మాదాల శ్రీమన్నారాయణ, శివకుమారి, నారాయణ, సుబ్బారావు, బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



భూమన అభినయరెడ్డిని కలిసిన జిల్లా నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్‌రెడ్డిని నెల్లూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలో శనివారం జరిగిన యువజన విభాగ మీటింగ్‌లో పలు అంశాలపై చర్చించిన అనంతరం నెల్లూరు నుంచి వెళ్లిన ఊటుకూరు నాగార్జున, రాష్ట్ర యూత్ సెక్రటరీ సునీల్‌రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీ నరేష్‌నాయుడు, కావలి యూత్ ప్రెసిడెంట్ చైతన్య, నగరి యూత్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ తదితరులు అభినయరెడ్డిని కలిశారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీఓ నేతలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు (అర్బన్): నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లాను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ నేతలు శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువా కప్పి సన్మానించారు. సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో ఎన్జీఓ పక్షాన కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షులు కరుణమ్మ, చిన్నమ్మ, లక్ష్మి, అన్నపూర్ణ, కృష్ణకుమార్, కృష్ణంరాజు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురంలో హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలను పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పరీక్షల నిమిత్తం హాస్టల్లోని తాగునీటి శాంపిల్లను సేకరించారు.



ఘనంగా కృతజ్ఞతార్పణల పండగ



బైబిల్ బుక్ స్టాల్‌ను ఏర్పాటు చేసిన సంఘ పెద్దలు

నెల్లూరు(బృందావనం): బాప్టిస్టు చర్చి డొనీహాల్ వార్షిక కృతజ్ఞతార్పణల పండగను ఘనంగా నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న చర్చిలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలను జరిపారు. సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ నేతృత్వంలో బైబిల్ బుక్ స్టాల్, తినుబండారాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పాటలు, క్విజ్, ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు సంఘ కాపరి రెవరెండ్ కంది శ్యాంసన్‌కుమార్, హుల్డా శ్యాంసన్ ప్రోత్సాహకంగా బహుమతులను అందజేశారు. అనంతరం కె.శ్యాంసన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పండగ శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమై ఆదివారం ఉదయం జరిగే ప్రత్యేక కృతజ్ఞతారాధనతో ముగియనుంది. కార్యక్రమంలో సంఘ చైర్మన్ సురేంద్ర, ఇవాంజలిజం డైరెక్టర్ గంటా జార్జి స్టీవెన్‌సన్, డీకన్స్, డాక్టర్ మణిరావు, కృపారాజన్, వరప్రసాద్, కృపాల్, అవినాష్, డాక్టర్ రాజకుమారి, జ్యోతి జయకుమార్, మేరీ బ్లెస్సింగ్టన్, రాణి కాలేబ్, యూత్ డైరెక్టర్ సంజయ్, స్త్రీల సమాజం నేతలు, గ్రామీణ సంఘాల కాపరులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీమ్ వర్క్‌తో పనిచేద్దాం

నెల్లూరు(అర్బన్): జిల్లా అభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు టీమ్ వర్క్‌తో పని చేద్దామని నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ శాఖల హెచ్‌ఓడీలతో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. హెచ్‌ఓడీలతో పరిచయం కార్యక్రమం ముగిశాక కలెక్టర్ మాట్లాడారు. పని చేసేటప్పుడు ఎన్నో సమస్యలు వస్తుంటాయన్నారు. అయినప్పటికీ పాజిటివ్ కోణంతో ముందుకెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తాను కోనసీమ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే సమయంలో అక్కడ తనతో పాటు డీఆర్వో మాత్రమే ఉన్నారన్నారు. అయినా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ముందున్నామన్నారు. అదే విధంగా ఇక్కడ ఉద్యోగులందరూ పని చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఇక్కడి నుంచి బదిలీ అయ్యేటప్పటికీ తాను ఏమి చేశానో చెప్పుకోదగ్గ గుర్తులు ఉండాలన్నారు. తప్పులు చేస్తే ఇబ్బందులు పడుతారన్నారు. జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజయకుమార్, ఆర్డీఓలు పాల్గొన్నారు.